కథానిక

# నేను ప్రేమిస్తున్న ప్రపంచం

"సావేరి"

సాయంత్రం కావొస్తున్నది. కళ్లల్లో పచ్చ గడ్డి మెరుస్తున్నది. 'ప్రతి ఆదివారం శెలవు.' సైబీరియా కొంగలు ఇంకా పార్కు బెంచీలకి చేరగిలపడలేదు. ఇంకా లేసీటి సంగీతపువేళ దాటనేలేదు.

ఏదో మునిగిపోయినట్టు నేనుమాత్రం అప్పటి కప్పుడే పార్కులో ఈ పచ్చగడ్డిలో జంకుతూ పడుకుని- పరధ్యానంగా నా కళ్లముందు, చెట్టు కొమ్మకి గిలించిన లావణ్యమైన వెడల్పాటి పచ్చటి పేజీవలె, మార్గరెట్టూ విష్ణుమూర్తీ నన్ను పరామర్శిస్తున్నట్టు ఊహించుకుంటున్నాను.

ప్రూఫ్‌రీడరు తన భార్యకి జార్జెట్టు చీర తెచ్చిపెట్టి, 555 సిగరెట్ల టిన్ను కత్తిరిస్తూ, సినిమాలో ఇద్దరూ 'బాక్స్'లో కూర్చున్నట్టు, లైట్లు ఆర్పినప్పుడు సరససల్లాపాలు చేస్తున్నట్టు, సరసపరిల్లా సేవిస్తున్నట్టు, చాక్లెట్లు మింగితే చేదుగావున్నట్టు కథల్లో వర్ణించుకునే ఫక్కీలో- కూర్చుని నేను పచ్చగడ్డి కసిగా గట్టిగా పళ్ళ మధ్య కరచుకుని- పచ్చగడ్డీ పెన్సిలూ నోట్లూ కాగితాలు, సిగరెట్టూ గట్టిగా నోటకరచుకుని, ఈ పార్కుమధ్య ఈ చెట్లమధ్య కూర్చుని వున్నాను 'రాజా స్నోకి నకలు: మోసపోకండి' గడ్డిమీద కొట్టుకొచ్చిన వార్తని పట్టుకున్నాను.

నెల్లాళ్ళనుండీ ఒకేకల నెల్లాళ్ళనుండి విష్ణుమూర్తినీ మార్గరెట్‌నీ చూడాలని. ఒకే పువ్వులోని రెమ్మలవలె, ఒకే తోరణంలోని రంగు దీపాలవంటి మామిడాకుల్ని తెంపివేసి, మా జీవితాలని విడదీసిన ఇట్టి రెండువందల మైళ్ళ దూరాన్ని నిరాకరిస్తున్నాను. ఊరికి వెళ్తానంటే నాన్న యిష్టపడనందుకు. నెల్లాళ్ళనుండీ ఒకే కల. వాళ్ళిద్దరినీ చూద్దామని. నా అరిచేతుల్లో పాపాయిని. వాళ్ళిద్దర్నీ చూడాలని.

చేతుల్లో చేతులు కలిపి, ముఖాలురాసుకొని, గడ్డాలకింత సబ్బు పట్టించి, ఒకరొకరమూ "అయాచితంగా" ఒకేసారి "అయాచితంగా" గట్టిగా బిగ్గరగా "అయాచితంగా" అరుద్దామని వుంది. వెళ్ళడానికి జేబులో డబ్బువుంది. నోట్ల రంగునీ, జేగురుకాంతుల్నీ ప్రసరిస్తున్న ఇట్టి ప్రపంచంలో ఒక్క నవ్వే, ఒక్క దుర్భరానందమే ఇాకిప్పుడు చూపట్టుతున్నది.

ఐతే నాన్న అనుజ్ఞ కావడంలేదు. నేను వెళ్లాల్సిన ఊళ్లో ఏవో వ్యాధులున్నాయనే సాకుతప్ప. ఇవాళప్రొద్దున నేను ప్రయాణం కట్టి, జట్కాని పిలిచి, బండీలో ఎక్కబోయే సమయానికి—అప్పుడే రైలుదిగి వచ్చిన మా నాన్న ఒక్కమాటతో ('వద్దు') నెల్లాళ్ళు నిండిన నా కలని ఛిద్రం చేశారు. నా ఇంద్రధనస్సుని ఫెళ్ళున విరిచేశారు. నా ఆశలన్నిటినీ ఒక్కసారి నీటిలో కలిపివేశారు. గాలిలో.

ఏంచెయ్యను. ఇన్నేళ్ళనుండి వినయవిధేయతల్లో చెప్పుచేతల్లో ఆకుల్లో అణగారివున్నాను. చెప్పుకింద ప్రూలవలె, వంతెనకింద నీళ్ళవలె. ఇవాళ పొమ్మంటే పోతుందా మరి. అక్కడ మెండుగా జబ్బులున్నాయనే సాకుతప్ప. ఎవరైనా జబ్బులు కోరితెచ్చుకుంటూగా యేమిటి? నేను ఊర్లవెంట తిరగడం మొదలుపెడితే చెడిపోతానని కాబోలు. బెంగ. అడిగినప్పుడు నాలుగణాల డబ్బు యివ్వడంలేదు గాని, చెడిపోతానని,—బెంగ (బెంగాలు దేశం నుండి వచ్చిందా ?)

అమ్మమటుకు ఏ చెడుగాలి, ఏ అంటువ్యాధీ నాకు సోకకుండా వుండేటందుకని ఎంతమొత్తుకున్నా (ఆడవాళ్లకి అర్థమై చస్తుందిగనకా !) 'అంత్రం' కట్టకమానలేదు. పైపెచ్చు, 'పెద్దవాడివయ్యావు- మేం చెప్పేదేముంది గనక- వెళ్తే వెళ్ళు నీయిష్టం' అంటుంది, నాన్న మాత్రం, 'వీడు బాగుపడ్తాడని ఒకప్పుడు అనుకున్నాం గనకా' అన్నట్టు పరకాయించి చూస్తాడు.

రైలు కూత వేసుకుంటూ పార్కువెనక బెంచీలనుండి రోడ్డుప్రక్కగా స్టేషన్‌లోకి పోతున్నది. మళ్ళీ తిరిగివెళ్ళే రైలు కూడా అదే. గబగబా లేచాను. త్వరత్వరగా పోతున్నాను. ఐతే నేను వెళ్ళదల్చిన ఊళ్ళో రైళ్ళూ, వీధులూ, ఇళ్ళూ అన్నీ ఖాళీగావుంటాయి కాబోలు, నా అడుగుల చప్పుడే వినపడుతున్నది నాకు. నేనడిచే రీతిమీద అసహ్యంవేసింది నాకు. భయం, నడక, మనస్సు చప్పుడు, భయం. జేబులో బరువెక్కుతున్న నోట్లని ఒక చేత్తో అదిమిపట్టాను. నోట్లకి బదులుగా ఒక గంటక్రితం నోట్లుగా మారిన మాచెల్లాయి నగలు నా చేతికి గుచ్చుకుంటున్నాయి మనస్సుకి. ఏం చెయ్యను? ఆందోళన పడ్డాను. కొత్తబూట్లు కరుస్తున్నవి. ఏంచేయను మరి. సంవత్సరంనుండీ అనుకుంటున్నాను. బూట్లు కొందామని, కలం కొనుక్కుందామని, మంచి దుస్తులు తొడుక్కుందామని. లేదు, నువ్వు చస్తే పూడ్చడానికి తప్ప, డబ్బులేదు.

డబ్బులేనప్పుడల్లా ప్రపంచంముందు వీగిపోయినట్టు కన్పిస్తాము. ప్రపంచంనుండి వేరు చేయబడినట్టు 'బైకుల్లా'లో పూడ్చిపెట్టి, నవనాడులు పెళ్ళగించి, తల్లివేరు మొదలంటా నరికివేసినట్టు 'అబ్బాసీ'వలె అబ్బ, భయం. వెధవ బూట్లూ, నోట్లూ సిగిరెట్లూ తప్ప, ప్లేగు భయం తప్ప-ఇప్పుడు నా మనస్సులో మరొకటి పాదుకొని లేదేమో.

బూట్లు కరుస్తున్నాయని చెప్పాను. ఈ బూట్లనే సంవత్సరంనుండి కొనాలనుకున్నది నేను. కొన్నతర్వాత, కొంటున్నప్పుడూ డబ్బు ఎంతగానో పగలబెడుతున్నా ననిపించింది. ఒక్కొక్క రూపాయే లెక్క పెట్టి యిచ్చేప్పుడు (నేను సంపాదించి నాకు నేను పోషించుకుంటున్న దేమీ లేకపోయినా- వెధవ డబ్బూ ఇల్లూ స్నేహితులూ - వెధవ సంబంధాలూనూ) నా ఒక్కొక్క నెత్తురు బొట్టునే స్వయంగా ఈ నా చేతుల్తో కొలిచి ఊడ్చి యిస్తున్నాననిపించింది.

ఇంట్లో అమ్మగాని నాన్నగాని ఈబూట్లు ఎక్కడివినీకు, ఈ 'రూపాయిలు' ఎట్లా వచ్చాయి నీకు అని అడుగుతారేమోనని భయపడ్డాను. భయం అనర్థాలాంటివి. భయంతప్ప, ఇంట్లో భయభయంగా నన్ను నేను అనుమానించుకోడం తప్ప, నన్ను నేను రొంచుకోడంతప్ప, భయం కల్పించుకోడమే అవుతుందిగాక!

కానీ-ఇప్పుడు నిశ్చయంగా నాకు తెలిసి వస్తున్న దేమంటే డబ్బు ఒక్కటే ప్రపంచంలోని ప్రేమనీ అధికారాన్ని అభిమానాన్ని ఒకరికొకరు పంచిపెట్టుకొనేది, కొనివేసేది, మాట్లాడేది, చేసేది, మనిషిని చంపేది. డబ్బు ఒక్కటేనని.

జీవిస్తున్నది నీవూ నేనూ కాదు-

డబ్బు డబ్బు డబ్బు డబ్బు!

డబ్బుయివ్వకపోవడంవల్ల [లేకపోవడంప్రశ్న కాదు] వెర్రివాడిలా మానాన్న ఒట్టినే నా బూట్లవంక చూసీ చూడనట్టు; అన్నం తినేప్పుడు అమ్మ నా కొత్త దుస్తులవంక వీక్షించడం తప్ప వీక్షించి సంతోషించడం తప్ప; ఇవి నీకు ఎక్కడినుండి వచ్చినవీ అని అడిగే తాహతు వాళ్ళ మటుకు వాళ్ళు ఇవాళనుంచి పోగొట్టుకున్నారన్న మాట. మంచిది.

ఐతే నేను నగని దొంగిలించానని మీకు చెప్పాను. కానీ నా చెల్లెలు చచ్చిపోయిందని మీకు చెప్పలేదేమో. చచ్చిపోయి మూడు నెల్లయినా తిరక్కమునుపే మరోచెల్లెల్ని [నాకు ఐదుగురు అప్పచెల్లెళ్ళు] తనకి యిచ్చి పెళ్లిచేయమని మా బావగారు మా నాయనగారికి కబురు చేశారని మీకు చెప్పలేదేమో ... అందువల్ల ఇంట్లోవాళ్ళు నగపోయిందని తెలుసుకోడం కలలో కూడా జరగని విషయం...దొంగతనం చేయడం నిజమే. తప్పేను విస్మరిస్తున్నాను. నన్ను నేను నిందించుకొని ప్రయోజనం ఏముంది. అందువల్ల.

అమ్మకిగాని నాన్నకిగాని ఇంట్లోని మరి ఇతరత్రా వాళ్ళందరికీ ఇవాళనుండి నామీద అధికారం పోయిందిగద. అందుకు గర్వించడంలేదు. బాధపడడం లేదు. అందువల్ల ఏమాత్రమూ జంకనేది లేకుండా నేనిట్లా ఎవరికీ చెప్పకుండా మనశ్శాంతి కోసం ఈ పంజరంనుండి భయపడి పారిపోతున్నానేమో. రైల్లోకూర్చున్నాను. చచ్చిపోయిన నా చెల్లెలిముఖమూ, నగవిషయం గుర్తుకువచ్చినప్పుడల్లా ముచ్చెమటలు పోస్తాయి.

నన్ను నేను వేధించుకుంటున్నాను నేను చేస్తున్న పనికి. చేసిన తప్పుకి. ఇంకముందెప్పుడూ

దొంగిలించకుండా వుండేందుకు ప్రమాణం చేస్తున్నాను. అలవాటు పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకునేందుకు ఒట్టు పెట్టుకుంటున్నాను. ఇవన్నీ ఎవరికీ చెప్పలేను. ఎవరికీ తెలియనివ్వకుండా నన్ను నేను విరగడ చేసుకుంటున్నాను. ఐతే ఇంట్లో వాళ్లకి నామీద అనుమానం వేయదా? నేను అమాయకునిలా కన్పిస్తాను గనకా? అడగరు. ఎందుకు అడగకూడదూ. చీవాట్లు. అన్నీ ఆలోచిస్తున్నాను. ఆలోచనతో నన్ను నేను పీడించుకుంటున్నాను. నా మనస్సునీ జేబులోని నోట్లనీ కాల్చి చంపుతున్న అభిమానాన్నీ ... ఐతే నేను మార్గరెట్‌నీ విష్ణుమూర్తినీ కలుసుకోవాలనే ఉద్దేశంతో ఈ ప్రయాణం సాగిస్తున్నాననుకోడంలో ఏ కొద్దీ నిజం లేదు. రైలు కదిలి పోతున్నప్పుడు, పార్కులో చెట్లూ వీధిలో లైట్లూ కార్లూ జనసంపదా వెనక్కి పరిగెడుతున్నప్పుడు నాకు అవగాహన కాబోతున్నది. నాకు వ్యతిరేకం జరగబోతున్నది. ముఖంమీద ఛెళ్లునకొట్టినట్టు గూడు పుఠాణీ. నా మనస్సు వెనకాల లోయల్లోకి, మానసిక సరోవరంలోకి, చిటపట రవులుకు పోతున్న కోర్కెలవంటి చిట్టడవుల్లోకి ఇట్లాంటి ఆలోచన స్పందన నిబంధించడం, ఊడ్చివేయడం, వెలికి లాగడం, కనీసం ప్రయత్నించడం ఇప్పుడు చేస్తున్నాను.

గుప్పిటలో ఇంత డబ్బు పెట్టుకుని మనస్సుని ఇంతగా కష్టపరుస్తున్నాను. అసలీ ప్రయాణం చేయకపోతే ఏంపోయింది. మనశ్శాంతికి బదులుగా భయాన్నీ దుర్భరాన్నీ కొని తెచ్చుకుంటున్నానేమో. అంతర్వాణిని కాస్త అణచి పెట్టడం కోసం సిగరెట్టు వెలిగించాను. మంచి సాధనం. నావంటివాడి ఒంటరితనానికి మిగిలిపోయిన గుక్కెడు ఆనందంలో మిగిలిపోయిన ఈ ఒక్క సిగరెట్టుతో సమస్తవ్యాకులితాన్నీ చిగిర్చే విహ్వలతల్నీ వ్యాకులతల్నీ మరచిపోతున్నాను.

'ఐతే నువ్వు చేసిందేమీ బాగా లేదోయ్!' శాక్యమైన నవ్వు మధ్య ఒక వృద్ధుడు రైల్లో మరో కుర్రాడికి బుద్ధి గరపుతున్నాడు. నా ముఖంమీద బలంగా చరచినట్టు. నాకేమీ సంబంధం లేకపోయినా నిందార్హునివలె కిటికీ బైటకి తలపెట్టి వరిచేలల్లో పరిగెడుతున్న కాపు పిల్లల్ని పరకాయిస్తున్నాను. రాక్షసి బొగ్గు. కళ్లు భగ్గున మండుకుపోయాయి. రైలు ఆగింది. నేను దిగాల్సినచోటు వచ్చింది. కళ్లు నులుముకుని, క్రాపుని రెండు చేతుల్తో ఘనంగా సవరించుకుని రైలు దిగాను.

ప్లాట్‌ఫారంమీద నాకోసం ఎదురుచూస్తున్న స్నేహితుణ్ణి కలుసుకుని, ఇంతకుముందు మాఊళ్లో మాఇంట్లో మా అమ్మ పెట్టెలో బంగారు నగని దొంగతనం చేసిన మనిషిని నేను ఎరగనట్టు, వాడికీ నాకూ సంబంధం లేనట్టు, వాణ్ణి నేను దిగిన రైల్లోనే వదిలి పెట్టి—నేను నా స్నేహితునితో పాటు ఆ మహాజన సంకీర్ణంలో, కాగితం పిట్టలగుండా టెలిఫోన్ తీగెలమీదుగా విన్పిస్తున్న జన జంతు జంత్ర సమ్మేళనంలో సర్వభావాలు చేర్చిన సంగీతంలో కలసిపోయి నన్ను నేను మరచిపోతున్నాను. తన్మయత.

* * *

ఒకటి రెండు సార్లు కలుసుకోడం తప్ప, నాలుగారేడు మాట్లు ఒకరికొకరం ఉత్తరాలు వ్రాసుకోడం తప్ప విష్ణుమూర్తికీ నాకూ పెద్ద పరిచయమేమీ లేదనే చెప్పాలి. ఇంకా మనస్సులు కలుసుకోలేదు. డబ్బు దగ్గర కలిగే మనస్పర్థల విషయం. ఐతే ఉత్తరకాండ జరిగింది. కార్యకలాపాలు, స్నేహాలు, టీలు, సిగరెట్లు, సినిమాలు, విమర్శలు అన్నీ ఉత్తరకాండ మూలంగా. (ఈ ఆలోచన ఇంతకుముందెప్పుడూ నాకు కలగలేదు. ఒకరితో ఒకరు ఎంతో గాఢ మైత్రి ఉన్నవాళ్లవలె ప్రయత్నించాను. ఇప్పుడు తెలుస్తున్నది. నాలో ఎంత అజ్ఞానం, తెలివి తక్కువతనం జాగిలాలవలె నిబడీకృతమై వున్నాయోనని.)

విష్ణువుతో పాటు అతని గదికి వెళ్తున్నాము. ఊళ్లో ప్లేగు విస్తరి పరుచుకున్న మాట నిజమేనని చెప్పాడు. నా శరీరం కాగుతున్న చమురులోని అణుసమూహాంవలె విడిపోతున్నట్టు గమనించాను. గగుర్పాటు, తొట్రుపాటు, భయం లేదు. నేను అభయం యిచ్చుకున్నాను. ఐతే నేను ఊహించుకున్నట్టు కనీసం మా అమ్మా నాన్నా ఇతరత్రా వాళ్లు గగ్గోలు పడినట్టు

ఇక్కడ రైలు నిర్జన ప్రదేశంలా, ఊరు ఖాళీ వీధులవలె ఏమాత్రమూ లేదు. ఏవో అక్కడక్కడా కుట్రలు, రహస్యాలుకూడా బలుక్కునే మేడలు తప్ప, మేడల గోడలమీద ఆతుక్కుని బల్లులు తప్ప, మేడలకివేసిన కొత్త తాళం కప్పలు ఖిల్లాకాలవలె కాపలా గూర్ఖాలు తప్ప మరో మార్పేమీ కన్పించలేదు. ఎప్పటివలెనే రిక్షాలు లాగుతున్నారు. బిచ్చగాళ్ళ రోడ్డు ప్రక్క పాటలతో కడుపులు నింపుకుంటున్నారు. వాళ్ళమూగ తపస్సు ఇట్టి కనక లోకాన్ని వేయినోళ్ళా ప్రశంసిస్తాయి. నిస్సత్తువగా శవంవలె నీడవలె బరువులు మోస్తున్నారు. బ్రతుకులు లాగుతున్నారు. ఈ దృశ్యం ప్రపంచంనుండి ఎప్పటివలెనే తొలగిపోదేమో. ఏమో మరి. రేపటి మార్పుని ఎలా సూచించగలం. దిక్సూచిని మార్చగలమా !

దారివెంటనడుస్తూ ఎర్రని ఏగానీవంటిదుమ్ము కాలర్ మీద చొక్కా చేతులమీద పడుతూంటే, విష్ణుమూర్తి ప్రశ్నమీద ప్రశ్న వేస్తున్నాడు. నివ్వెరపోయి నోరు తెరచి నాప్రక్కనే నడుస్తున్న విష్ణుమూర్తి ఒక్కసారి ఆగిపోయాడు.

అతను ఇంత వరకునుంచీ మాట్లాడిన ఒక్కదానికీ నేను ఊలక్క పలక్క పోతున్నానని నాకు తెలిసి వచ్చింది. ఇది నా ఆడంబరం? సిగ్గువేసింది. ఇంతవరకీ నా ఆలోచనలన్నీ మందాకిని కరుడెంచు రాయంచలవలె మార్గరెట్ మీదకి పరావర్తనం చెందాయి. అలాగని ఇప్పుడిప్పుడే విష్ణువు పడిన ఆశ్చర్య చకితానికి నేను గురౌతున్నాను. మెరుపువలె విభ్రాంతి. ఇంద్రధనస్సువలె విరిగిపోతున్న మనస్సు.

'క్షమించండి. మనస్సేమీబాగాలేదు. మరో విధంగా అనుకోవద్దు.'

'అబ్బే. మనలో మనం? ఛ-ఛ! అలా ఎందుకనుకుంటాను...'

(ఈ కేటగిరీ వాళ్ళ మనస్సు సగభాగం ఎప్పుడూ ఆలోచించే పనిమీదే వుంటుంది!)

'నాకు మీరు కొత్తవారా యేమిటి!'

అప్పటికీ ఆతని వదనంలో పూర్వపు మెరుపు స్ఫటికంవలె నీరెండకాంతివలె ద్యోతకమాతూనే వుంది. భయపడ్డాను. ఏమనుకున్నాడో. నన్ను నేను మనస్తాపం చేసుకొన్నాను. భూస్థాపితం. ఐనా నేనేం చెయ్యగలను! 'కొద్దిగా తెలివి గలిగి ప్రవర్తించు' ముందు జాగర్తలు తీసుకున్నాను.

గదికి వెళ్ళిన తర్వాత కాళ్ళకి బూట్లులేవనే విషయం గుర్తుకి వచ్చింది. రైల్లో మరచిపోయాను. తాపీగా కూర్చున్నాను. వెధవమతి-మరపూ. జేబునుండి సిగరెట్టు తీశాను. ఫీడా వొదిలింది! అగ్గిపుల్ల వెలిగించాను. ఉఫ్! మనసు బాధపడిపోయింది. ఉఫ్!

ఎంత ప్రయత్నించినా ఆరాత్రికి మార్గరెట్ కళ్ళూ, నాకు సుటీగ్గా ఆమె పొడుగుపాటి అందమైన చేతులూ, నిర్భరానందమైన నవ్వూ, బాటాబూట్లూ తప్ప మరేమీ కన్పించడం లేదు. పన్నెండూ ఏడణాలు. ఫర్వాలేదు. వీపు తట్టుకున్నాను. ఫర్వాలేదు. ఇప్పుడు కొంత నయం-

వీధుల్లోకి వచ్చాము. ఇక్కడ నడవడం నాకు చాలా యిష్టం. హోటల్లో, సినిమాల్లోకి, పార్కుల్లోకి, లైబ్రరీల్లోకి, రైళ్ళల్లోకి, కాలేజీల్లోకి. అన్నీ గుర్తుకి వస్తున్నాయి. వెనకటి స్నేహితులు తిరిగి కలుసుకున్నట్టు. తిరిగి ప్రేమికులు ఒకరినొకరు బిగుతుగా కౌగిలించుకున్నట్టు.

ఈ ఊరిని నేను ప్రేమిస్తున్నాను. ఈ వీధిని. నేను వచ్చింది కూడా అందుకే. మార్గరెట్ కోసం కాదు. విష్ణువుకోసం కాదు. అవన్నీ జీవితాన్ని ఖులాసా చేయడానికి, కైపు ఎక్కించడానికి. ఉత్తేజాలతో ఊపిరితిత్తులకి ఖుషీకోసం జల్సాకోసం ఉల్లాసాలతో ఉన్మత్తతతో అవయవాలు ఉద్రేకంతో వేడిఎక్కి, కంపించిపోయి—మంచినీటి పారుదలకి అంకుశనాళి కావాలి. అలాగ.

నేను ఎంతో ఎక్కువగా విసుగుపుట్టి విరక్తి చెంది అసహ్యించుకునేది; ఎంతో ఎక్కువగా మక్కువతో చేతుల్లోకి తీసుకుని సిగ్గుపడి లాలించి ప్రేమించి నవ్వించి కవ్వించేది ఈ ఒక్క ఊరే. ఇది పాగిన్ కావొచ్చు. బైకల్లా కావొచ్చు. ఎందుకో చెప్పలేను. అన్నీ చెప్పేస్తున్నామా, తెలిసే బ్రతుకుతున్నామా. అన్నీ అంతే.

వెధవివి. అనవసరంగా కొన్నాను. పోతే పోనివ్వండి. వెధవబూట్లు. ఎవడిక్కావాలి. డబ్బు. వాటికోసం ఎంతడబ్బు తగలబెట్టాను.

ఖర్చుపోతే ఎవడికి కావాలి. డబ్బు. ఖర్చు కాదు. పోయింది డబ్బు! పన్నెండూ ఏడణాలు!

ఆ డబ్బుగనక వుంటే కాలం ఇంకా పచ్చ రంగునే తాల్చివుండేది. ఐతే ఇప్పుడు ఒక్క డబ్బుతోనే ప్రపంచాన్ని గడపడం నిజం కాదేమో ననిపిస్తుంది. ఏమో ఇది ఎంతవరకు నిజమో. ఏమో. ఎవరికి కావాలీ తర్కం!

మార్గరెట్ కళ్లల్లో మెరుస్తున్నది. నన్ను గురువుగా యెంచుకునే మార్గరెట్.

విష్ణుమూర్తి నాకోసం చాలా డబ్బు ఖర్చు చేస్తున్నాడు, ఇది నాకు బాధనే కలిగిస్తుంది. బానిసత్వం. చూడబోతే వాలకాన్ని బట్టి-నేను విష్ణుమూర్తినీ, మార్గరెట్‌నీ, ఈ ప్రపంచాన్నీ దగా చేస్తున్నానా? వాళ్లు దేన్ని ఆశించి నా దగ్గరికి వస్తున్నారు? మనిషి. దేన్ని ఆశించి మరో మనిషిదగ్గరికి పోతున్నాడు? ఆవస్తువు నిజంగా నాదగ్గర లేదేమో.

ఊహించడం ప్రమాదమని. కల్పించుకోడం అవుతుందా అంతాను ఎవరో రచయిత అన్నాడట. నేను ఆచరణలో పెట్టాలని సిద్ధాంతమా యేమిటి!

* * *

సాయంత్రంపైన సాయంత్రాలు. పేజీలపైన పేజీలు. జీవితంపైన జీవితాలు.

దూరాభారాలని ఒక బిందువువద్ద విలీనం చేస్తూ, తిరిగి సాయంత్రాన్ని తీసుకొస్తున్న రైలు.

గదిలో ఎవరమూ లేనట్టే సంచరిస్తున్నాము. ఒంటరితనాన్ని భరిస్తున్నాము. చదువుతున్నాము. కాగితాలు తిరగవేస్తున్నాము విష్ణుమూర్తి పరీక్షలకి చదువుతున్నాడు. అతని రూమ్‌మేట్.

కడుపులో కుట్టుగావుంది. గట్టిగా అరవాలని. నేను మధ్యమధ్య లేచివెళ్ళి ఇన్ని పైపునీళ్లు కడుపునిండా నింపుకుని ప్రేగులు అరుస్తుంటే రాజఠీవి ఉట్టిపడగా పడుకుని నిద్రకి ప్రయత్నిస్తున్నాను. పక్కలకి ఒత్తిగిలుతున్నాను. ఉదయంనుండి పడుకుని పడుకుని మేల్కొని వుండడంవల్ల నడుముల దగ్గర్నుంచి క్రిందకి శరీరం మొద్దుబారిపోయింది. జెర్రిపోతువలె. పింగాణీ గిన్నెలో రాయివలె. పైనుంచి ప్రక్కటెముకలు కలకవేస్తున్నాయి దుప్పటిచెరుగుల్లో ఒత్తుకుపోయి గీట్లుపడ్డ ముఖాన్ని-అద్దంలో నా ముఖానికి స్నో మెత్తుతున్నాను. గడ్డంకింద సాగదీసి, చిదిమి, రాసి, సాగదీసి, యథాప్రకారంగా దువ్వుకుని, మళ్ళీ అద్దం ఒకప్రక్కన పెట్టి మళ్ళీ కునుకుతీస్తున్నాను.

కళ్లు తిరుగుతున్నాయి. ఉదయం నుండీ తాగిన పైపునీళ్ళు కడుపులో జలదరిస్తున్నాయి. వికారం. నీళ్ళుకదిలితే శబ్దం. నేను ఒట్టినే ఆలోచనారహితమైన మనస్సుతో వరండాలోని గదిలోకి అటూ యిటూ తిరుగుతున్నాను. ఇతర్లు నేను పరిగెడుతున్నానో లేక తూలిపడిపోతున్నానంటారో మరి. అందుకు జాగ్రత్తగా అడుగులు లెక్కించుకుంటూ తిరుగుతున్నాను. ఎవరమూ ప్రశ్నించుకోలేదు. ఏమీ మాట్లాడుకోలేదు. ఒకరి మొఖాలొకరికి అనుకోకుండా దగ్గరిసా రావడమే గనక జరిగితే ఇద్దరమూ పెదవులమీదకి బలవంతగా నవ్వు తెచ్చుకుంటాము. రంగూ డబ్బూ నవనాడులూ వెలిసిపోయిన నవ్వు. బలవంతంగా బలవన్మరణంలా నవ్వు ఏమీ. ఎరగనట్టు ఇంకా స్నేహంగానే వున్నట్టు.

విష్ణుమూర్తిదగ్గరా నాదగ్గరాఉన్న నాలుగు రాళ్లూ అయిపోయాయి. మనియార్డరుకోసం ఎదురు చూడటం మామూలు. అతను ఎక్కడా తెచ్చే ప్రయత్నమైనా చెయ్యనందుకు (చేశాడేమో) నాకు ఒకవైపు కష్టం మరోవైపు ఇంకో రకమైన మనస్సు కన్పిస్తున్నాయి. కాలు కాలిన పిల్లివలె గదిచుట్టూ తిరగడం తప్ప చేసేదేమీ కన్పించడం లేదు. ప్రొద్దు పోవడంలేదు. డబ్బువుంటే టైం వుండదు. టైంవుంటే—ఇప్పుడలావుంది. ఏరోజు కారోజు ఇట్టే బరువులు లాగే కూలీవలె అలసి అంగలార్చి ఆర్భాటపడుతున్నది. మార్గరెట్‌ని కలుసుకోకుండా తిరిగిపోతున్న రోజులు. కాని తప్పిదమే చేశానేమో మొదట ఆమె కన్పించినా మాట్లాడకపోవడం. చూడనట్టుగా ముఖం పక్కకి తిప్పుకోడం ఆమె ఏమనుకుని పోతుందోననే జ్ఞానమైనా లేకుండా తెలియదు. సినిమాలో కన్పించిన మార్గరెట్‌ని చూచీ చూడనట్టు, డాంబికునివలె అలక్ష్యం చేయడం, ఇప్పుడుపోయి డబ్బుకోసం

వచ్చినట్టు ముఖం పెడితే, ఆమెని డబ్బు అడిగేది ఎలాగని? మర్యాద తెలియదు.

ఏమీ అడగకుండా ఇలా శవంవలె పడి వుండేదెలాగని. ఇటు విష్ణుమూర్తి చేసే ప్రయత్నమేమీ కన్పించలేదు. కనీసం ప్రయత్నం. డబ్బు రాకపోతే ఎవడిక్కావాలి. కనీసం ప్రయత్నం.

రోజులు ఇట్టే గడచిపోయాయి. దుర్దినాలు దుస్స్వప్నాలవలె ఆరంభమౌతున్నాయి. ఇద్దరమూ మామూలు ప్రకారం బైటకి వెళ్లేవేళయింది.

విష్ణుమూర్తి పుస్తకాలు మూశాడు. సర్దుతున్నాడు. అతని రూమ్ మేటుబిగ్గరగా చదవడం ఒక క్షణంపాటు ఆపి, కళ్లెత్తి విష్ణుమూర్తి బైటికివెళ్లే ప్రయత్నాన్ని వీక్షించాడు. క్షణంపాటు అతనూ ఇతనూ ఎప్పుడూ మాట్లాడుకోగా నేను చూళ్లేదు. చూట్టం పళ్లేదు. విష్ణుమూర్తి రూమ్ మేట్ మళ్లీ లుంగీ సర్దుకుని ట్రంకుపెట్టెముందు భీష్మించుకు కూర్చొని, కాలరు, చొక్కా చేతులు సవరించుకుని. మళ్ళీ బిగ్గరగా గోడలు, అద్దాలు, మనుషుల ముఖాలు పగిలిపోయేంత బిగ్గరగా చదువుతున్నాడు నేను షికారు వెళ్ళడానికి విష్ణుమూర్తికోసం బైట నిల్చున్నాను. విష్ణుమూర్తి రూమ్ మేట్ దగ్గరికి గబగబా వెళ్లాడు. అతని ముఖంమీద టపటపా నాలుగైదుసార్లు చరిచాడు. ఎందుకు? బిగ్గరగా చదువుతున్నాడని. అదేమంత తప్పా? మెల్లిగా చెపుతే సరిపోదూ? మరెందుకని? ఏమో కోపం చల్లారిన తర్వాత విష్ణుమూర్తి చెపుతాడేమో నాకు. అతని స్వభావాన్నిబట్టి అప్పటిదాకా ఆగడం మంచిది. రూమ్ మేట్ తప్పేమీ లేకుండా ఎందుకు కొడతాడతను. కొడితే అతను ఊరుకోడం వేరుమళ్ళీ.

* * *

వెళ్లి పార్కులో కూర్చున్నాము. పచ్చగడ్డి కళ్లలో మెరుస్తున్నది. తిరిగి వచ్చేప్పుడు విష్ణువు నన్ను మాట్లాడించాడు. మనస్సు చీకాకుగా వుండడంవల్ల రూమ్ మేట్ ని తనుకొట్టానన్నాడు రెండు చేతులూ విప్పి. విస్తుపోయాను. నాకు మాత్రం గ్యారంటీ ఏమివుంది గనుక.

నేను దారిమధ్యలోనే ఇప్పుడే వస్తానని చెప్పి చీలిపోయాను మరో పేటకి. మార్గరెట్ దగ్గరికి. ఆమె చేతులు, ఆలోచనలు, పువ్వులు పరిమళాలు, నవ్వులు సడలిపోతున్న ఆలోచనలు అన్నీ ఒకదాని వెనక ఒకటి మనస్సుని తినివేస్తున్నాయి. అంతా ఆలోచన్ల పని. మైలురాయి దాటి వెళ్ళాను. మార్గరెట్ హాస్టలులో లేదు. అక్కడో చీటీముక్క విడిచిపెట్టి ఈసురోమని తిరిగిపోయాను. మరునాడు తిరిగివచ్చి అక్కడితో ఆగిపోయే రైలువుంది. స్టేషన్ కి రమ్మని వ్రాశాను. గదికి వచ్చాను. విష్ణుమూర్తి 'రండి, వెళ్ళి కాఫీతాగివద్దాము' అన్నాడు. ఒకరూపాయితో వెళ్లాము, తాగాము. మూడణాలు మిగిలింది. తిరిగి గదికి వచ్చాము. ఉదయంనుండీ ఎంతగానైతే నోరు కట్టివేసుకున్నామో - అవన్నీ మాటలు, మంచితనం, మర్యాద, మమత, కోర్కెలు మర్యాద మమత ఒకదానివెనక మరొకటిజలప్రళయంవలె వస్తున్న మాటలు, విలువైనవి, నమ్మకమైనవి, ప్రేమించేవి, లాలించి ప్రేమించేవి, ముత్యాల మాటలు, ఆణిముత్యాల నవ్వులు ఉదయంనుండీ జరిగిన కథని, అద్దాల్లో చిక్కుపోయిన ముఖాలని పాలిపోయి తెల్లబడిన చేతుల్ని పరిశీలించుకుని నవ్వుకున్నాము.

బ్లూలైటు కింద పచ్చగా చచ్చిపడిన వేలాది పురుగులు. జాలాదీలోవలె రోడ్డుమీద వేలాది పురుగులు. తూర్పు గర్భవతివలె గర్వకారణమైంది. ఇద్దరం కాఫీ తాగాము. సిగరెట్లు. నేను మార్గరెట్ కోసం. విష్ణుమూర్తి, 'ఎక్కడికి వెళ్తున్నారు?' అడిగాడు నన్ను. ఎక్కడికీ లేదు. 'ఇప్పుడే వస్తాను.' వెళ్లిపోయాను స్టేషన్ కి. విష్ణుమూర్తి నన్ను వెంబడిస్తున్నాడా' ఛ. ఒట్టి నాఛాదస్తం తప్ప...ఛ. అతను అలాంటివాడు కాదు. ఐతే నిజానికి ఎందుకైతే నాకీ జాడ్యం పుట్టిందో తెలియదుగాని - మొత్తమీద మార్గరెట్ విషయం విష్ణుమూర్తికి చెప్పడానికి నా మనస్సెందుకో అంగీకరించలేదు. ఉదయంనుంచీ మనస్సుని చలాయిస్తున్న అంతర్వాణి. వ్యతిరేకంగా నామీద గూడుపురాణీ జరిపే నా అంతర్వాణి. తిండి లేక కాఫీ లేక సిగరెట్లు లేక మనస్సుమీద చలాయిస్తున్న అంతర్వాణి.

మార్గరెట్ వద్దకు వెళ్లేప్పుడు అంతర్వాణిని తీసి తుంగలో తొక్కాను. పడిపోయిన ఆకూ, అలమూ చెట్టుచుట్టూ సంబంధాన్ని వదులుకోలేక తల్లిచెట్టుచుట్టూ తిరిగే రీతిన వెధవది, ఎప్పుడూ రణగొణ ధ్వని చేస్తుంది. ఏం మునిగిపోయింది మహా.

వెళ్లాను. స్టేషన్‌లో రైలు ఆగివుంది. ఫస్ట్ క్లాస్ కంపార్టుమెంటులో యెక్కి పడుకున్నాను. ఫాన్ వేసుకున్నాను. మార్గరెట్ ఇక్కడికి వస్తుందని నమ్మక మేమిటి. నీ చీటీ ఆవిడకి అందిందో లేదో. సినిమాలో కన్పించి ఎందుకు మాట్లాడలేదు. ఇందులో నా పొరపాటేమిటి? -ఇలా మార్గరెట్ ఎక్కడ ప్రశ్నిస్తుందోనని తల్లడిలి పోయాను.

అబ్బే. అసలు ఆమె వచ్చే సూచన్లే లేకపోతే. ఇంక నాతో మాట్లాడి, నన్ను ప్రశ్నలతో వేధించే దెవరు. తిరిగి వెళ్లిపోదా మనుకున్నాను. ఎంతకీ రాదు. లేచి, కంపార్టుమెంట్ దిగుతున్నాను. కిటికీనుండి నావైపు నడచివస్తున్న నల్లటి చీరె కన్పించింది. నల్ల చీరెలోనుంచి తొంగి చూస్తున్న ఎర్రటి ఒళ్లు.

మా-ర్గ-రె-ట్!

కూలబడ్డాను. ముఖం, కళ్లు, పెదవులు సంతోషంతో విద్యుద్దీపించాయి.

ఆమెవచ్చి నా సరసన కూర్చుంది. ఆమె రెండు చేతుల్నీ నా చేతుల్లోకి తీసుకున్నాను. ఆమె కళ్లల్లో నీరు నిండింది. ఎందుకు, అప్రయత్నంగా నాకళ్ళవెంటకూడా నీరు వచ్చింది. ఎందుకు, ఆమెమీద మోపబడిన నీలాపనిందలకి. వెరచానా. లేదు. అనుమానించానా. లేదు.

సిస్టర్! ఓదార్చాను. మంచి మాటలాడాను లాలించాను తల్లివలె

'ఇప్పుడే వస్తాను. ఇక్కడే వుండండి వెళ్లొద్దు.'

'వెళ్లేరు సుమా!' నమస్కారం చేసి తిరిగి వస్తానని వాగ్దానం చేసి వెళ్లిపోయింది. ఆమె తిరిగి రాదేమో? నాకు అనుమానం ఎక్కువ! లేదు. అనుమానించ లేనేలేదు. ఒట్టినే భయం తప్ప ఇందులో ఆమె నాకు చేస్తున్న మోసం ఏముంది గనక! అడగా లనుకున్నాను డబ్బు. అడగలేకపోయాను. పాపిష్టి డబ్బు. ఆమె వెళ్లిపోయింది. నన్ను ఇక్కడే ఎందుకు ఉండమంది, తను ఎందుకు వెళిపోయింది. తిరిగి తను నాకు తెచ్చేదేమిటి? ఆమె నాకు ఏమియిస్తుంది. యివ్వగలదు? తెలియదు. చూశాను. విసుగెత్తిపోయేంతవరకు ఎదురుచూశాను ఆమె రాదు. నాభయం నిజమే. కొన్ని జరగబోయేవి ముందుగా నేను చెప్పగలననే మాట నిజమే. ఇప్పుడు మార్గరెట్ రాలేదు. డబ్బుకోసం వెళ్లిందా. నేను ఆమెతో డబ్బు కావాలని చెప్పానా లేదు. ఆమె డబ్బుకోసం వెళ్లిందా. లేదేమో. అందుకే రాలేదేమో. ఇందులో ముఖం చెల్లకపోవడాని కేముంది. లేకేం. ఏమీ లేదు. ఒట్టినే. ఆమె రాలేదు. వచ్చి రెండు మూడు మాటలు మాట్లాడిపోతే చాలదూ. ఆమెనుండి అంతకంటే నేను కోరేదేమున్నది. సిస్టర్ రాదు. నా సిస్టర్ రాదు.

విసుగుపుట్టి చివరికి గదికి బయల్దేరాను. ఇంకో నాలుగడుగుల్లో రాయల్ థియేటరు విష్ణుమూర్తి గదిగా మారబోతున్నది. ఇంతలో రిక్షాగంట విని ప్రక్కకి తొలిగాను. ప్రక్కనుండి 'మిమ్మల్నే' స్త్రీ గొంతుక విన్పించింది. నన్ను కాదు. మార్గరెట్‌కి మాగది ఎలా తెలుస్తుంది? నన్ను కాదు. ఆ గొంతుక మార్గరెట్‌ది కాదా. తిరిగి చూశాను. అమ్మ దొంగా. ఆమె నవ్వుతూ రిక్షా దిగింది. వాపోతూ ఆమెని ఆహ్వానించాను. 'మీరు ఉత్తరంలో వ్రాశింది ఈ నావలేనా?' 'కొన్నావా నాకోసం. నేను కొనమన్నానా నాకోసం. చాలా బావుంది.' 'ఈ పుస్తకంకోసం ఎన్నాళ్లనుండీ వెదుకుతున్నాను.'

'వస్తాను'—మార్గరెట్.

అప్పుడే. ఇంతలో ఏంపోతుంది. వెళ్లి చేసే ఘనకార్యం ఏముంది. కోపం వచ్చిందా. నామీద కోపం. 'మంచిది ఉత్తరం రాస్తాను.' 'అలాగే. వస్తాను' 'మంచిది.'

తిరిగి గదికి వచ్చాను. ఈ పుస్తకం పేజీలు తిరగవేసేముందు జాగర్తగా వెనుదిరిగి చూశాను. మార్గరెట్ తిరిగి వెళిపోయిందో లేదోనని బాధపడ్డాను. నాకోసం ఆవిడ పది రూపాయలు పెట్టి ఈ పుస్తకం కొన్నందుకు, నాకు కొనిపెట్టినందుకు చాలా బాధపడ్డాను. 'ప్రేమతో మీ మార్గరెట్' - పుస్తకం మొదటి పేజీ అడుగున వ్రాసి

వుంది. పేజీలు తిరగవేస్తున్నాను రెపరెపమని పచ్చటి అరటిగెల నిశ్శబ్దంగా క్రింద పడింది, రోడ్డుమీద. తీసి 'దేశముఖ్' సంతకం చూసు కుని జేబులో పెట్టుకొన్నాను పది రూపాయలు. 'ప్రేమతో మీ మార్గరెట్' గదికి వెళ్ళాను. విష్ణు మూర్తిని కలుసుకున్నాను. సంతోషంలో హృద యాలు విప్పి మాట్లాడుకున్నాము. ఆహ్లాదం తెలియబర్చుకున్నాము. కాని బాధ. అడుగున వెలితి. మనస్సు వెనకాల అడుగున బాధ.

హోటళ్ళు, పాన్ బీడాలు, సిగరెట్లు. సినిమాలు, వీధులు, విహారాలు, రహస్యాలు, నవ్వులు, పుస్త కాలు, విందులు, కాఫీలు, సిగరెట్లు. ప్రేమతో మీ మార్గరెట్. మళ్ళా తిరిగి వెళ్ళే రైలు

గదిలో తీరిగ్గా కూర్చుని రైలు టైము చూస్తున్నాను.

మధ్యతరగతి సంస్కృతికి జేజేలు

# నెరవేరిన భ్రాతృ ధర్మం

అమరశ్రీ

**మా** అన్నయ్యకు నామీద రోజురోజుకూ కోపం ఎక్కువై పోతున్నది. నేనుమాత్రం నా అభిప్రాయాన్ని మార్చుకోలేని స్థితిలో ఉన్నాను. మార్చుకున్నా అది మాఅన్న తృప్తి కోసం మాత్రమే.

ఆరోజు సాయంకాలమైనా ఎక్కడకూ కదలలేదు. నాగదిలో పండుకొని ఏదో ఆలో చిస్తున్నాను. ఎందుకు వచ్చాడో కూడా నాకు తెలుసు. అతను దేనిని గురించి మాట్లాడటా నికి వచ్చాడో కూడ నాకు తెలుసు. ఇవంతా నాకు ప్రాణకంటకంగా ఉన్నా సహిస్తున్నా. ఎందుచేతనో గాని తెలియదు.

'రాత్రి కనుపించలేదేం?' అన్నాడు వచ్చి రావటంతోనే మా అన్న.

'ఇంట్లోనే ఉన్నానుగా' అన్నాను.

'నువ్వు రాగానే నాదగ్గరకు రమ్మనమని చెప్పమని మీ వదినతో చెప్పానే' అన్నాడు.

'వదిన నాతో చెప్పలేదు.'

'మీ 'రిజల్ట్స్' ఎప్పుడు వస్తాయి?'

'ఈ నెలాఖరులో వస్తాయి.'

మెల్లగా మాఅన్న అసలు సంభాషణలోకి దిగాలని ప్రయత్నిస్తున్నాడు. అతని వైఖరి నంతా గమనిస్తూనే ఉన్నాను ఆ స్థితిలో కూడ.

'ఈ శలవుల్లో నీపెళ్ళి స్థిరం చేస్తాను.'

నేనేమీ మాట్లాడలేదు.

'ఏమంటావు?'

'కొత్తగా చేసనేదేముంది' అన్నాను.

'ఇప్పటికీ పెళ్ళి చేసుకోవటం నీకిష్టం లేదన్న మాటేగా.'

మళ్ళా కాస్సేపు నిశ్శబ్దం

'ఒకప్పుడు ఇష్టంలేనిది ఈరోజు మాత్రం ఏవిధంగా ఇష్టమౌతుంది.'

'నాకోసమని నీవు చేసుకుంటున్నట్లేనా?'

'ఆ! తప్పకుండా, అంతే' అన్నాను తాపీగా. నేనంత నిబ్బరంగా మాట్లాడుతూంటే మా అన్న చాల ఆశ్చర్యపడుతున్నాడు. నేనంత నిశ్చ యంతో ఎన్నడూ మాఅన్నతో మాట్లాడలేదు. ఇంత ధైర్యం, ఇంత శక్తిసామర్థ్యాలు నాలో అణగిమణగి ఉన్నాయని మాఅన్న అనుకొని ఉండడు. నేను చదివిన బి. ఎ. నాకింత ఉప యోగపడుతుందని ఆయన అనుకోలేదు.

'తరువాత లోకం నన్ను చంపేస్తుంది తమ్ము డికి పెళ్ళి చేయలేదని. నన్నొక అసమర్థుడన వచ్చు లోకులు. స్వార్థపరుడు అని అన్నా అన వచ్చు. తండ్రి లేని తమ్ముడికి పెళ్ళిచెయ్యలేదనే అప్రతిష్ట వస్తే నాకేగా వచ్చేది?' అన్నాడు.

'అందుకనేగా, చేసుకుంటానంటున్నది.'

'చేసుకున్న తరువాత అవక తవకలు వస్తే అందరూ నా నోట్లో ఉమ్మివెయ్యరూ!'

'అవక తవక లెందుకు వస్తాయి?'